## క్లుప్తంగా

### బీసీలకు వైఎస్సార్ సీపీలోనే అధిక ప్రాధాన్యం



ఎమ్మెల్యే కోన రఘుపతిని సన్మానిస్తున్న వేణుగోపాల్

**బాపట్ల:** బీసీలకు వైఎస్సార్ సీపీలోనే అత్యధిక ప్రాధాన్యం లభిస్తుందని మరోసారి రుజువైందని బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీటా వేణుగోపాల్ పేర్కొన్నారు. తనకు అధ్యక్ష పదవి రావడంతో ఆయన ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు అత్యున్నతమైన పదవులు ఇవ్వటం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలందరం రుణపడి ఉంటామని చెప్పారు. పార్టీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. బీసీ నాయకులు పీటా వెంకట రమణ, బొర్రా సుబ్బారావు, పీటా భాస్కరరావు తదితరులు ఉన్నారు.

### ఏబీఎం ఆస్తులను కాపాడుకోవాలి

**బాపట్ల అర్బన్ :** స్థానిక ఏబీఎం స్కూల్‌లో దుడ్డు జాన్ ప్రసన్న బాబురావు అధ్యక్షతన గురువారం ఐక్య కార్యచరణ కమిటీ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి క్రిస్టఫర్ మాట్లాడుతూ బాపట్ల పట్టణంలో ఉన్న ఏబీఎం ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రెసిడెంట్ దుడ్డు జాన్ ప్రసన్న బాబురావు, వైస్ ప్రెసిడెంట్ గడ్డం దేవాదానం, కార్యదర్శి జొన్నలగడ్డ క్రిస్టఫర్, ఉప కార్యదర్శి మాసిపోగు వేణు, కోశాధికారి గడ్డం మరియదాసు, కార్యవర్గ సభ్యులు తాడికొండ ప్రేమ్చంద్, జొన్నలగడ్డ సాధు హెర్బత్, గుడిపాటి, నాగరాజు, శృంగారపు రమేష్ కుమార్ ఎన్నికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో స్థానిక పాడిసన్ పేట పెద్దలు, సీబీజెడ్ కార్యవర్గ సభ్యులు పాల్గొని ఏకగ్రీవంగా పై కార్యవర్గాన్ని ధృవీకరించినారు.

### వాహనాల తనిఖీ

**భట్టిప్రోలు:** భట్టిప్రోలులో బాపట్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఆర్టీఓ) ప్రసన్న గురువారం తనిఖీలు నిర్వహించారు. పది వాహనాలను తనిఖీ చేసి, తగు ధృవీకరణ పత్రాలు లేనందున రూ.60 వేలు అపరాధ రుసుం విధించినట్లు ఆమె తెలిపారు. ట్యాక్స్‌లు పెండింగ్ ఉన్న వాహనదారులు వెంటనే చెల్లించాలని, లేకుంటే పెనాల్టీ పడుతుందని తెలిపారు.

### నేడు స్కూలు బస్సు ప్రారంభం

**రేపల్లె రూరల్:** యూఎస్ఏలో ఇండియన్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న జొన్నగడ్డ సుధాకర్ తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం రూ.22లక్షల వ్యయంతో మండలంలోని వడ్డీవారిపాలెం శ్రీమతి సావిత్రి గణేష్ జడ్పీ హైస్కూలుకు అందించిన స్కూలు బస్సును ఈ నెల 24న శుక్రవారం 10 గంటలకు ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, బౌడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు ప్రారంభించనున్నారు. హెచ్ఎం మట్టా జ్యోత్స్న ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలోతెలిపారు.

**భట్టిప్రోలు:** టీఎంరావు హైస్కూల్ 79వ వార్షికోత్సవం శనివారం నిర్వహించనున్నట్లు హెచ్ఎం చందలూరి రామకోటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున, బాపట్ల డీఈఓ పీవీజె రామారావు, డెప్యూటీ ఈఓ జి.వెంకటేశ్వర్లు హాజరు కానున్నట్లు తెలిపారు.

# పార్టీ అభివృద్ధికి గృహసారథులే వారధి

**మంత్రి మేరుగ నాగార్జున**



అమర్తలూరు సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

**పలివేరు(వేమూరు):** గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు సంక్షేమ పథకాల వారధిగా పనిచేస్తే.. గృహ సారథులు వైఎస్సార్ సీపీ వారిధిగా పని చేయాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. చుండూరులోని సెంటిన్స్ స్కూలు, అమర్తలూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గ్రామ సచివాలయ వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మేరుగ నాగార్జున పాల్గొని, మాట్లాడారు. మార్చి 18వ తేదీ నుంచి గృహ సారథులు, వలంటీర్లు, కన్వీనర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలతో కొంత సమయం కేటాయించి, మాట్లాడాలన్నారు. సంక్షేమ పథకాల అమలును వివరించాలని సూచించారు. రాష్ట్ర ప్రజల బంగారు భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిరంతరం పని చేస్తున్నట్లు చెప్పారు. వేమూరు నియోజకవర్గంలో గృహ సారథులు 30 వేల మంది పార్టీకి పని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఎంపీపీలు రాపర్ల నరేంద్ర, జాలాది రూబేను, జడ్పీటీసీలు మూల్పూరు లావణ్య, దాట్ల సౌజన్య, ఏఎంసీ చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, గ్రామ సర్పంచ్‌లు పందిపాటి ఏసు, దేవరకొండ రాము, గాదె శివరామకృష్ణారెడ్డి, యలవర్తి సురేష్, జిల్లా గ్రామ సచివాలయం కన్వీనర్ రవీంద్రరెడ్డి, రాష్ట్ర సాహిత్య అకాడమీ డైరెక్టర్ ఒలేటి శివాజీ మండల సచివాలయ కన్వీనర్లు బట్టు మోషే, అన్నవరపు వీరారెడ్డి, ఎంపీటీసీలు తెనాలి ప్రవీణ్ కుమార్, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ఎమ్మెల్యే కోన రఘుపతి**



సంక్షేమ లబ్ధిపై ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళతో ఎమ్మెల్యే కోన రఘుపతి

**బాపట్ల:** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మరుప్రోలువారిపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలా పాలన కొనసాగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాభివృద్ధికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆర్బీకేలతో రైతులకు నేరుగా సేవలు అందించటాన్ని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు గమనిస్తున్నాయని తెలిపారు. బాపట్ల నుంచి పాండురంగాపురం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని తెలిపారు. జాతీయ రహదారి నాలుగు లేన్లతో ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషిని గుర్తుంచుకోవాలన్నారు. తాను అడిగిందే తడువుగా బాపట్ల జిల్లా ఏర్పాటుకు ముందే జాతీయ రహదారి విస్తరణకు సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. జాతీయ రహదారి అభివృద్ధితో మరుప్రోలువారిపాలెం, అసోదివారిపాలెం, మద్దిబోయినవారిపాలెం గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని చెప్పారు. మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, పార్టీ నాయకులు వీరరాఘవరెడ్డి, ఏడుకొండలరెడ్డి, రావివెంకన్న, నర్రా వెంకట్రావు, చేజర్ల నారాయణరెడ్డి, జాలి రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

### ప్రణాళిక బద్ధంగా చదివితే ఉద్యోగం..

**బాపట్ల అర్బన్:** బాపట్ల శ్రీ భావపురి విద్యా సంస్థలు, సీఈడీఎం సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్ సంయుక్త కోచింగ్ సెంటర్‌లో టాలెంట్, ప్రిలిమ్స్ టెస్టుల్లో ప్రతిభ కనబర్చిన 26 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు ఎమ్మెల్యే కోన రఘుపతి గురువారం బహుమతులు ప్రదానం చేశారు. కోన ప్రభాకరరావు జ్ఞాపకార్థం తిమ్మరాజు వెంకట సుబ్బారావు, దాసరి చిన భూషణం అందించిన రూ.10వేలు ఈఎం ప్రథమ విజేత చినగంజాంకు చెందిన నిద్ర నిషితారెడ్డికి అందజేశారు. ముప్పలనేని శేషగిరిరావు జ్ఞాపకార్థం ముప్పలనేని శ్రీనివాసరావు అందించిన రూ. 10వేలను టీఎం ప్రథమ విజేత ఓబినేని చౌదరి నరసింహకు అందజేశారు. కన్సోలేషన్ బహుమతులు గుంటూరు ఈ–అకాడమీ డైరెక్టర్స్ డాక్టర్ ఏవీ లక్ష్మి, అబ్దుల్ మునాఫ్ అందజేశారు. ప్రిన్సిపల్ ఆవుల వెంకటేశ్వర్లు, పీటా వేణుగోపాల్ పాల్గొన్నారు.

# వెల్లటూరు పీహెచ్‌సీలో రాష్ట్ర బృందం



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యులు

**భట్టిప్రోలు:** మండలంలోని వెల్లటూరు పీహెచ్‌సీని స్టేట్ కన్సల్టెంట్ టీమ్ గురువారం సందర్శించింది. స్టేట్ కన్సల్‌టెంట్ ఎస్.అరుణకుమారి, జిల్లా సమాచార అధికారి లక్ష్మణ్ బృందంలో ఉన్నారు. ఎనిమియ ముక్త్ భారత్‌లో భాగంగా గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పండంటి బిడ్డకు జన్మనిస్తారని సూచించారు. పీహెచ్‌సీ వైద్యురాలు చావలి రామలక్ష్మి ఆధ్వర్యంలో 26 మంది గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

**రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు**



పమిడిమర్రులో చేపల పెంపకం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి

**చెరుకుపల్లి:** గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశానికి మోపిదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాపట్ల జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన చీరాల ప్రసాద్ రెడ్డిని ఎంపీ మోపిదేవి, నాయకులు ఘనంగా సత్కరించారు. జడ్పీటీసీ సభ్యురాలు మరివాడ పావని, వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ పైనం ఏడుకొండలరెడ్డి, వైస్ ఎంపీపీలు పైనం రంగారెడ్డి, కొత్తపల్లి సుమలత, కో–ఆప్షన్ సభ్యుడు ఫరూక్, కామినేని కోటేశ్వరరావు, ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

**దేశరక్షణే లక్ష్యంగా ఆర్మీ జవాను విధులు**

**నిజాంపట్నం:** దేశ రక్షణే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న ఆర్మీ జవానులను ప్రతి ఒక్కరూ అభినందించాల్సిందేనని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు పేర్కొన్నారు. మండలంలోని బావాజీపాలెంలో ఆర్మీ డే సెలబ్రేషన్స్ వేడుకలను గురువారం నిర్వహించారు. మోపిదేవి మాట్లాడుతూ.. తీరప్రాంతమైన బావాజీపాలెంలో ప్రతి కుటుంబం నుంచి ఒకరిద్దరు ఆర్మీలో ఉండటం మనకు ఎంతో గర్వకారణమన్నారు. మాజీ సైనికులు, వారి కుటుంబసభ్యులను అభినందించారు. కార్యక్రమంలోఎంపీపీ మోపిదేవి విజయనిర్మల హరనాథబాబు, స్థానిక సర్పంచ్ మహ్మద్ నజీర్ అహ్మద్, జడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎంపీపీ ప్రసాదం వాసుదేవ, మాజీ సైనికులు పాల్గొన్నారు.

**నగరం:** మండలంలోని శిరిపూడి గ్రామంలో రూ.40లక్షలతో గ్రామ సచివాలయ భవన నిర్మాణానికి రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు గురువారం శంకుస్థాపన చేశారు.

**ఆక్వా సాగుతో మంచి లాభాలు..**

మండలంలోని పమిడిమర్రు గ్రామంలో ఏర్పాటు చేసిన ఏఆర్‌టీ ఆక్వా ఉత్పత్తి, చేపల పెంపకం కేంద్రాన్ని ఎంపీ మోపిదేవి ప్రారంభించారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జడ్పీటీసీ మాన్యం నాగమణి, సర్పంచ్‌లు ఉదయలక్ష్మి, పమిడిపాముల మరియమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గణపతిరెడ్డి, మాణిక్యరావు, నిరీక్షణరావు, వీరయ్య, బాబురావు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

**డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు**

**పేరలి(కర్లపాలెం):** డ్వాక్రా రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఏ పీడీ అర్జునరావు తెలిపారు. పేరలి గ్రామంలోని చైతన్య, శ్రీ విద్య స్వయం సహాయక సంఘాల పనితీరును గురువారం ఆయన పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ మహిళాభ్యున్నతికి ఒక్కొక్క సంఘానికి రూ.10లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణాలు ఇస్తున్నారని తెలిపారు. సున్నా వడ్డీ పథకం, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాల నగదును బ్యాంకర్లు వ్యక్తిగత రుణాలకు బదిలీ చేసే వీలు లేదని.. అలా జరిగితే వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, గ్రామ సంఘం అధ్యక్షురాలు సత్యమణి, లక్ష్మణాచారి, పూర్ణచంద్రరావు, శివ కోటేశ్వరరావు, వీవోఏలు, షాలిని, సుకన్య, మహిళలు ఉన్నారు.

**బాపట్ల అర్బన్:** అప్పికట్ల, సూర్యలంక గ్రామాల్లో ఆర్థిక అక్షరాస్యతపై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ బి.అర్జున్‌రావు మహిళా గ్రూపులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీపీఎం లక్ష్మణాచారి, ఏపీఎం డి.సురేష్, సీసీలు కె.ప్రకాష్, ఎన్.శివరామ్‌ప్రసాద్, ఎ.రత్నరాజు, వీఓఏలు పాల్గొన్నారు.

# భట్టిప్రోలులో 'ఈనాడు' ప్రతులు దహనం



ప్రతులు దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**భట్టిప్రోలు:** ఈనాడు దిన పత్రికలో తప్పుడు కథనాలకు నిరసనగా భట్టిప్రోలులో వైఎస్సార్ సీపీ నేతలు ఆందోళన నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఈనాడు దిన పత్రికల ప్రతులను దహనం చేసి, నినాదాలు చేశారు. వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్య శాస్త్రి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, పంచాయతీ వార్డు సభ్యులు పెరికల శ్యామ్, షేక్ అబ్దుల్లా కరీమ్, వైఎస్సార్ సీపీ నాయకులు వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం, మోర్ల కోటేశ్వరరావు, తలకొల యలమంద, మేదూరి వీరయ్య, కె.ప్రసాద్, గోలి శ్రీనివాసరరావు, జవ్వాది కోటయ్య, ఎస్.జగన్‌మోహన్‌రావు, ఒగ్గి హనుమంతరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఒకేచోట కాదు..విడివిడిగా ఉండాలి

**ఐలవరం(భట్టిప్రోలు):** అంగన్‌వాడీ కేంద్రాలను సక్రమంగా నడపాలని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు ఆదేశించారు. గురువారం భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఒకే అద్దె భవనంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించడాన్ని గమనించారు. తాను మరోసారి పరిశీలనకు వచ్చే సరికి నిర్దేశించిన ప్రాంతాల్లో కేంద్రాలు ఉండాలని సూచించారు. అలాగే స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల హాజరు తగ్గిపోవడం పట్ల ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం బాగుండేలా విద్యార్థులకు వండి పెట్టాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. అనంతరం సచివాలయాన్ని పరిశీలించి, రికార్డులు తనిఖీ చేశారు. సచివాలయం–2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.20 లక్షల నిధులతో పూర్తయిన సీసీ రోడ్లను పరిశీలించారు. సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీ మురుగుడు శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

### ఆలయంలో హుండీ నగదు చోరీ

**గొరిగపూడి(భట్టిప్రోలు):** మండలంలోని గొరిగపూడి గ్రామ దేవత శ్రీ దేశమ్మతల్లి దేవాలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి నగదు అపహరించారు. గురువారం ఉదయం అర్చకుడు ఆలయం తలుపు తీయగా హుండీ పగలగొట్టి ఉండటాన్ని చూసి, దేవాలయ నిర్వాహకులకు, గ్రామ సర్పంచ్ గరిగపాటి మల్లికకు సమాచారం అందించారు. హుండీలో రూ.లక్ష వరకు నగదు ఉండొచ్చునని దేవాలయ నిర్వాహకులు తెలిపారు. సమాచారం మేరకు క్లూస్ టీమ్, సీఐ క్రైమ్ టీమ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ ఎస్ఐ శ్రీనివాసరావు, ఏఎస్ఐ దానయ్య, పోలీస్ సిబ్బంది వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.